ఆన్‌లైన్‌కు అవాంతరాలు



- వందల సంఖ్యలో అనుమతిలేని భవన నిర్మాణాలు
- సిబ్బందికి శిక్షణ ఇవ్వకుండానే నిర్వహిస్తున్న సర్వే
- కొలతలపై యజమానుల అభ్యంతరం

బాన్సువాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అస్తుల ఆన్‌లైన్ సర్వేకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధి లో వందల సంఖ్యలో అనుమతులు లేని భవనాలు ఉండటం, కొంత మంది యజమానులు అభ్యంతరం చెబుతుండడంతో ఏమి చేయాలో తెలియక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సర్వేకు వెళ్లే సి బ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం, కనీసం శిక్షణ కూడా ఇవ్వకపోవడంతో వారికి వచ్చే అనుమానాలను కూడా నివృత్తి చేసుకోలేని పరిస్థితి నెలకొంది. 45 అంశాలపై సెల్‌ఫోన్ యాప్‌లోనే నమోదు చేయాల్సి ఉంది. ఒక్కటి నమోదు చేయకపోయినా యాప్ తీసుకోవడం లేదు. దీంతో సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకు సిబ్బంది మూడు సార్లు ఆస్తులను సర్వే చేశారు. ఇంటి యాజమాని చనిపోయిన వారి వారసులు, భవనాలు కొనుగోలు చేసిన వారు మ్యుటేషన్ చేయించుకోకపోవడం, కొందరికి ఆధార్ కార్డులు లేకపోవడం, నిర్మాణాలకు అనుమతుల్లేని భవనాలు ఉండడం, కొన్నిచోట్ల భవన యజమానులు ఇంటి నంబర్లు తీసుకోకపోవడం లాంటి వాటితో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీల్లో ఏటా వందల సంఖ్యలో భవనాలు క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. భవనాలు కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని డాక్యుమెంట్లు తీసుకుంటున్నారు. చాలా మంది మ్యుటేషన్ చేయించుకోక పోవడంతో అవి లెక్కల్లో కన్పించడం లేదు. ఇలాంటి భవనాలు ప్రస్తుతం సర్వే సిబ్బందికి వందల సంఖ్యలో ఎదురవుతున్నా యి. ఇంటి ఓనర్ నేనే అని చెప్పి అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదైన తర్వాత ఇంటి యజమాని ఫొటో, ఆధార్ వివరాలు నమోదు చేస్తే ఇతరుల పేరు మీద ఇళ్లు ఉన్నట్లు సిబ్బంది గుర్తిస్తున్నారు. సర్వేపై సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన లేకపోవడం, కొంత మందికి మ్యుటేషన్ విషయం కూడా తెలియని కారణంగా సర్వే తలనొప్పిగా మారింది. ప్రొఫార్మలో చూపిన విధంగా ప్రతి అంశం యాప్‌లో నమోదు చేయాల్సిందే. కొంత మంది యజమానులు అన్ని వివరాలు చెప్పిన తర్వాత ప్లాట్, భవనాల కొలతల విషయంలో అభ్యంతరం చెబుతున్నారు. భవనం ఉన్నది ఉన్నట్లు కొలతలు వేస్తే ఆస్తి పన్ను పెరుగుతుందనే అనుమానంతో కొలతలు కొలవకుండా అడ్డు చెబుతున్నారు. బాన్సువాడ, బోధన్ ప్రధాన రహదారిపై ఉన్న కొన్ని కమర్షియల్ దుకాణాలు, భవనాలను ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే వందల సంఖ్యలో నిర్మించారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఆస్తుల ఆన్‌లైన్ నమోదు విషయమై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. సర్వే ప్రక్రియ పారదర్శకంగా కొనసాగిస్తున్నాం. కొన్నిచోట్ల చిన్న చిన్న అవాంతరాలు ఎదురైనా వాటిని సరిదిద్దుతున్నాం. ప్రతి భవనం వివరాలను ధరణి పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తాం.

–రమేష్, మున్సిపల్ కమిషనర్, బాన్సువాడ

5 వేల డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తాం

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే



పిట్లం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం: జుక్కల్ నియోజకవర్గంలో పేదలకు 5 వేల డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని, అందుకు సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఎమ్మెల్యే హన్మంత్ సింధే వెల్లడించారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రూ. 550 కోట్లతో జుక్కల్ నియోజకవర్గంలో నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు కొనసాగుతున్నాయని, దీని ద్వారా నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. త్వరలో పిట్లంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. దళితులు అభివృద్ధికి సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం రాంపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, సహకార సంఘం చైర్మన్లు నారాయణరెడ్డి, శపథంరెడ్డి పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతో రాజ్యాధికారం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాములు

భిక్కనూరు: బీసీల ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. శనివారం మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 85 శాతం ఉన్న బీసీల్లో ఐక్యత లేకపోవడం వల్లనే 15 శాతం ఉన్న ఓసీలు రాజ్యం ఏలుతున్నారన్నారు. బీసీలకు రాజకీయ అవగాహన లేక వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మన ఓటు మన బీసీలకే అన్న నినాదంతో ముందుకెళ్లనున్నట్లు వెల్లడించారు. ఆ సంఘం నాయకులు మారోజు మోహనచారి, కొండ సాయిలు, ధర్మయ్య, మల్లేషు, శ్రీకాంత్ బాలయ్య, బాలాగౌడ్, రాములు సాయిలు, శివరాజు, యాదగిరి, శ్రీశైలం, రమేషు, మల్లేషు రఘుపతి మాసయ్య, నర్సింలు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసుల నమోదు



ఎల్లారెడ్డిలో రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

ఎల్లారెడ్డిరూరల్: రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని రైతులకు పోలీసులు హెచ్చరించారు. పోలీసులు శనివారం రైతులకు అవగాహన కల్పించారు. రోడ్లపై ధాన్యం ఉంటే అనుకోకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నర్సింగ్‌రావు ఉన్నారు.



లింగంపేట మండలం పర్మళ్లలో..

లింగంపేట: రహదారులపై ధాన్యం ఆరబోయొద్దని ఎస్సై శంకర్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శనివారం పర్మళ్ల గ్రామంలో రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన రైతులతో మాట్లాడుతూ వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఉన్న పురాతన శివాలయం అభివృద్ధికి గ్రామానికి చెందిన మద్దలింగం కుమారుడు ఎన్ఆర్ఐ వినయ్ రూ. 5 లక్షలను విరాళానికి సంబంధించిన చెక్కును ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ద్వారా ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మల్లేషు మల్లారెడ్డి, రాజిరెడ్డి, సిద్దరాములు పాల్గొన్నారు.

టీచర్‌కు దళితరత్న అవార్డు



బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన ప్రభుత్వ టీచర్ అయ్యాల సంతోష్‌కు మహాత్ముల జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో దళితరత్న అవార్డును ప్రదానం చేశా రు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకున్నారు. సామాజిక సేవారంగం, దళితుల అభ్యున్నతి, ఐక్యతకు కృషిచేస్తున్నందుకు అవార్డు దక్కిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని ఆయన వెల్లడించారు.

అంబేడ్కర్‌కు నివాళి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గంగాధర్

బాన్సువాడ రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను శనివారం ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు కళాశాల ప్రిన్సిపాల్ ఇందూరి గంగాధర్ పూలమాలలు వేసి నివాళులర్పించి వారి గురించి వివరించారు. అధ్యాపకులు భాస్కర్‌రాజు, పోతరాజు శ్రీనివాస్, రమాదేవి, రా జేష్, విఠల్, శంకర్రావు, ఉమారాణి పాల్గొన్నారు.

జాబ్ మేళా ద్వారా హెచ్‌సీఎల్‌లో ఉద్యోగాలు

బిచ్కుంద: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శనివారం నిరుద్యోగ యువకులకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పర్యవేక్షణ జిల్లా అధికారి షేక్ సలాం మాట్లాడుతూ హెచ్‌సీఎల్ టెక్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్ చదివిన విద్యార్థుల కోసం జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా కుటుంబానికి ఆసరాగా నిలవాలని కోరారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి త్వరలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్, హెచ్‌సీఎల్ ప్రతినిధి రాజేష్ కుమార్ పవన్ పాల్గొన్నారు.

రంజాన్ కానుక పంపిణీ

నస్రుల్లాబాద్: మండలంలోని మిర్జాపూర్ గ్రామంలోని ముస్లింలకు శనివారం బీఆర్ఎస్ నాయకులు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట రమణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలో ముస్లిం కుటుంబాలకు సర్పంచ్ ఈశ్వరీరేఖ రంజాన్ కానుక పంపిణీ చేశారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజీమ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అజీజ్, పర్వగొండ, మొగులుగొండ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మిద్దె ప్రణీత్ సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్ష రాసి సీటు సాధించడంతో స్థానికులు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భిక్షపతి, నాయకులు శాంతికుమార్, గంగయ్య, నర్సింలు, రమేషు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకూడదు



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్

బాన్సువాడ : పట్టణంలోని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ సూచించారు. శనివారం బాన్సువాడ మున్సిపాలిటీలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వార్డులో ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ రమేష్, టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, అసియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యువకులు అన్ని రంగాల్లో రాణించాలి



క్రికెట్ కిట్లను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజంపేట: యవకులు అన్ని రంగాల్లో రాణించాలని మండల కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. శనివారం రాజంపేటలో షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురి యువకులకు క్రికెట్ కిట్లను లను పంపిణీ చేశారు. ఇటీవల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో రాజంపేట మొదటి స్థానంలో నిలవడం పట్ల షబ్బీర్ అలీ హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాధర్ గౌడ్, వజాహద్ అలీ, ఇమ్రాన్ అలీ, షేక్ జమీల్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



దేవునిపల్లి ఇఫ్తార్ విందులో ముస్లింలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో మండల వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్‌కుమార్, చిన్నమల్లారెడ్డిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టగోని గోపిగౌడ్ శనివారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు లద్దూరి లక్ష్మీపతియాదవ్, లోల్లటి నారాయణ రావు, ఆజాద్, ఆరీఫ్, ముజ్జు, రేయస్, మునీర్, ఎజాజ్, రామా గౌడ్, నీలమ్మ, అనంతలక్ష్మీ శ్రీనివాస్, మహ్మద్ ఫజిల్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్

బాన్సువాడలో..

బాన్సువాడ : ఎంఐఎం ఆధ్వర్యంలో బాన్సువాడలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాల వారు కలసిమెలసి పండగలను జరుపుకోవాలని సూచించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్, ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు సైద్‌ఖాన్, నాయకులు ఎజాస్, అతిప్, నైమ్ హాసన్, సీఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఘనంగా పెద్దమ్మకు బోనాలు

దోమకొండ: మండల కేంద్రంలో వనదుర్గ పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి స్థానికులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం తిరుగుబోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పున్న లక్ష్మన్ తెలిపారు.

28 నుంచి జూనియర్ కార్యదర్శుల సమ్మె

- ఎంపీడీవోలకు సమ్మె నోటీసు



నాగిరెడ్డిపేటలో ఎంపీడీవో రఘుకు నోటీసు ఇస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



లింగంపేట ఎంపీడీవోకు అందజేస్తూ..

సాక్షి, నెట్‌వర్క్: రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 28వ తేదీ నుంచి నిరవధికంగా సమ్మెలోకి వెళ్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీడీవోలకు నోటీసు ఇచ్చారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. నాలుగేళ్ల ప్రొహిబిషన్ కాలాన్ని పూర్తి చేసుకున్నా రెగ్యులరైజ్ చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు లింగంపేట, నాగిరెడ్డిపేట ఎంపీడీవోలు మల్లిఖార్జునరెడ్డి, రఘు, ఎల్లారెడ్డి ఎంపీవో ప్రకాష్‌కు వారు సమ్మె నోటీసు ఇచ్చారు.



ఎల్లారెడ్డిలో..



మద్నూర్‌లో..

సంక్షిప్తం..

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

లింగంపేట: మండలంలోని భవానిపేట గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి శనివారం పరిశీలించారు. కూలీ గిట్టుబాటు కోసం సమయ పాలన పాటించాలని ఆయన సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు అవసరమైన తాగునీటి వసతి కల్పించాలని సిబ్బందికి సూచించారు.

నేడు హాథ్‌సే హాథ్ జోడో యాత్ర

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఆదివారం హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ష్ర కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం భిక్కనూరులో మీడియాతో మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ మంత్రి షబ్బీర్ అలీ తదితర ముఖ్య నేతలు హాజరవుతారని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఎల్లారెడ్డిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

సాక్షి, నెట్‌వర్క్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై ఆ శాఖ సిబ్బంది శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డిలో ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య, బాన్సువాడ ఇంచార్జి అగ్నిమాపక అధికారి రాజారెడ్డి, గాంధారిలో సిబ్బంది సంతోష్, రాజు, మద్నూర్ ఇంచార్జి ఫైర్ ఆఫీసర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడ బస్టాండ్‌లో మాక్ డ్రిల్..



గాంధారిలో అవగాహన కల్పిస్తూ..



మద్నూర్‌లో..

క్లుప్తంగా

మహిళల అభ్యున్నతికి తోడ్పాటు



నిజాంసాగర్: మహిళల సంక్షేమంతో పాటు అభ్యున్నతి వడ్డీ రాయితీ తోడ్పాటుగా నిలుస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని కొమలంచలో 39 స్వయం సహాయక సంఘాలకు రూ. 14.40 లక్షల వడ్డీ రాయితీ చెక్కులను మహిళా సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుర్మ సంతోష్, వీవోఏ జనబాయి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన బైక్‌లు స్వాధీనం

బిచ్కుంద: చోరీకి గురైన 48 బైక్‌లను సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారని స్థానిక ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలో చోరీకి గురైన వాహనదారులు నారాయణ్‌ఖేడ్ స్టేషన్‌కు వెళ్లి అక్కడ తమ వాహనాలు ఉంటే ఆర్‌సీ, ఐడీ కార్డు చూపి తీసుకోవాలని సూచించారు.

పేదలకు సరుకుల పంపిణీ



భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలోని పది నిరుపేద కుటుంబాలకు హైదారబాద్‌లో నివసిస్తున్న కాచాపూర్ వాసి మోతె సంతోశ్‌రెడ్డి నెల రోజులకు సరిపడా సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు శ్రీనివాస్‌గౌడ్, రహూఫ్, సిద్ధూ పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై గట్టి నిఘా



బిచ్కుంద: మండల కేంద్రంలోని అంబేడ్కర్, కందర్‌పల్లి, రాజుల్లా వద్ద జాతీయ రహదారిపై శనివారం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్సై అభిషేక్ వాహనాలను తనిఖీ చేశారు. గంజాయితో పాటు మహారాష్ట్ర నుంచి మద్యం రవాణా అరికట్టేందుకు తనిఖీలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



మద్నూర్: డోంగ్లీ మండలంలోని మల్లాపూర్‌లో శనివారం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలకు సర్పంచ్ ధర్మవ్వ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శశాంక్‌పటేల్ శంకుస్థాపన చేశారు. అర్హులైన వారందరికీ ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ విజయ్ పాటిల్, నాయకులు మాన్‌కారే సంజు, బాలు, సంతోష్, రాజు, యల్లప్ప, బాబు మియా తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



నిజాంసాగర్: ద్విచక్రవాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై నాగగోని రాజు సూచించారు. శనివారం మండలంలోని నర్వ గ్రామ గేటు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, లైసెన్స్ లేని వాహనదారులకు చలానా విధించారు.

నృసింహుడి ఆలయంలో డీఎస్పీ పూజలు



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కామారెడ్డి డీఎస్పీ సురేష్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీని ఆలయ ఈవో ప్రభురాంచంద్రం స్వామి శాలువా కప్పి సన్మానించారు.